# ఓ స్త్రీ! మోసపోకు

— తెన్నేటి రమలక్ష్మి

స్త్రీ స్వాతంత్ర్యం అనే గాలి విస్తృతంగా వీస్తున్న రోజులివి. స్త్రీని మగవాడికి బానిసగా చిత్రించి, ప్రతి మగవాడు స్త్రీ పురోగతికి ఆటంకంగా నిలబడ్డట్టు, ప్రతి స్త్రీ చెరసాలలో బందీయై మ్రగ్గిపోతున్నారనేంతటి చైతన్యం పొందారు కొందరు స్త్రీలు.

ఇటువంటి పరిస్థితిని అభివృద్ధికి సూచకంగా, స్త్రీ జనోద్ధరణకు నాందిగా వ్యాఖ్యానిస్తున్న వారూ లేకపోలేదు.

ఆధునిక పరికరాల యుగం ఆవిష్కారమయిన తర్వాత, అన్ని విషయాలతోపాటు పాశ్చాత్య పద్ధతి మంచిదనే మోజు ప్రబలిపోతోంది. తత్కారణంగా భారత నారీలోకంలో కొందరు హటాత్తుగా కళ్ళు తెరచి 'అయ్యో మన మహిళల గతి ఇలా దిగజారిపోతోందా!' అని స్త్రీ జీవన విధానంపట్ల తమ సంక్షోభాన్ని వ్యక్తపరచడం జరుగుతోంది. స్త్రీ స్వాతంత్ర్యం పేరుతో ఒక ఉద్యమాన్ని లేవదీయడం జరుగుతోంది.

పందొమ్మిది వందల అరవై మూడు ప్రాంతాలలో బెట్టీఫ్రీడాన్ అనే గృహిణి కాకతాళీయంగా వ్రాసిన 'ఫెమినైన్ మిస్టిక్' అనే పుస్తకం అమెరికాలో ఒక విచిత్రమయిన చైతన్యాన్ని కల్గించింది. అప్పటి కప్పుడే అక్కడ విడాకుల చట్టం విచ్చలవిడిగా నడయాడుతోంది. ఛిద్ర గృహాల సంఖ్య పెరిగిపోతూ వుంది. సాంఘిక పరంగా చూసినా, ఆర్థిక పరంగా చూసినా అక్కడి సామాన్య గృహిణికి ఎటువంటి రక్షణా లేకపోయింది. స్త్రీల అభిరుచికి గాని, యోగ్యతలకుగాని సరిపోయే ఉద్యోగాలు కరువయాయి. 'అబలలు-అంచేత వారికి ప్రాముఖ్యత నియ్యాలి' అనే నానుడి చింతకాయ పచ్చడయి కూర్చుంది.

అటువంటి దీన పరిస్థితి నుండి అక్కడి స్త్రీని కాపాడడానికిగాను నడుం కట్టి ముందుకు నడిచింది ఒక చిన్న ఉద్యమం. ఆ ఉద్యమానికి ఊపిరి-బెట్టీ ఫ్రీడాన్ వ్రాసిన పుస్తకం. అలా ప్రారంభమయిన ఉద్యమానికి 'విమెన్స్ లిబ్' అన్న నామకరణం జరిగింది.

ఈ సంస్థకు ఎటువంటి ఆర్థిక సహాయమూ లేకపోయింది. మీదుమిక్కిలి ఆ సంస్థ ఎదుర్కొన్న అవాంతరాలు కోకొల్లలు. అయినా ఆ 'లిబ్' సభ్యులు నిస్వార్థంగా కృషి చేసారు.

స్త్రీకి ఉన్న స్థానాన్ని మెరగుపరచడమే వారి ఆశయం. ఇంటింటికి తిరిగి తమ ఆశయాలను సాటి స్త్రీల ముందుంచి, వారిలో చైతన్యం తేవడం మొదలెట్టారు. ఆ విధంగా ప్రారంభమయిన 'విమెన్స్ లిబ్' అమెరికా దేశపు సాంఘిక వ్యవస్థను పునాదులతోసహా గడగడ లాడించింది.

ప్రయోజన లక్ష్యంతో, నిస్వార్థంగా ప్రారంభమయిన ప్రతి ఉద్యమం రాను రాను వ్యాపార సంస్థగానో, స్వార్థఫలాపేక్షను సాధించే పరికరంగానో మారడం - ఈనాటి నాగరికత వలన మనం పొందుతున్న సౌకర్యం.

ఈ 'విమెన్స్ లిబ్' విషయంలోనూ అంతే జరిగింది. ఆధునిక మహిళలు కొందరు, కొంగ్రొత్త అభిరుచులతో, అభిప్రాయాలతో 'విమెన్స్ లిబ్'ను తమ హస్తగతం చేసుకోవడం జరిగింది. వీరి సంకుచిత దృక్పథాలతో, స్వార్థంతో ఈ ఉద్యమం తన విశిష్టతను పోగొట్టుకుంది.

'బ్రా'లను నడివీధిలో తగలేయడం, లెస్బియనిజాన్ని విశృంఖలం చేయడంలాటి భావాలు ఆశయాలుగా మారి - స్త్రీ విమోచనం గురించి పాటుపడవలసిన ఈ 'లిబ్' కొందరు స్వార్థపరుల స్వప్రయోజనాలకు ఆలవాలమై కూర్చుంది. రాజకీయం చోటు చేసుకుంది. అరాజకత్వం ప్రబలింది. తత్ఫలితంగా 'విమెన్స్ లిబ్' అంటేనే అసహ్యం అన్నారు కాస్త పరువు మర్యాదలు కల స్త్రీలు. సంఘసేవలో అత్యంత ఉన్నత స్థాయినందుకుని, మహిళల మహోన్నత అభ్యుదయానికై కంకణం కట్టుకుని, నిరాఘాటంగా ముందుకు పోవలసిన ఈ చైతన్య స్రవంతిని తమ స్వార్థం కోసం తప్పు త్రోవలు త్రొక్కించడంలో కృతకృత్యులయారు. ఈ ప్రజావాహిని తమకంటె 'పాపులర్' అయిపోయి, ప్రజాదరణను పొందినట్టయితే - తమకు పుట్టగతులుండవన్న సత్యాన్ని గ్రహించిన రాజనీతిజ్ఞులు కొందరు, దూరాలోచన లేని స్త్రీలను కొందరిని చేరదీసి 'విమెన్స్ లిబ్'ను అత్యంత హీనస్థితికి దిగజార్చారు. తమకళ్ళను తామే పొడుచుకుంది అక్కడి మహిళా ప్రపంచం.

నాగరికత పరాకాష్టనందుకుంటున్న భ్రమ కలిగించే అమెరికాలో ఇంతవరకూ స్త్రీది రెండవ స్థానమే! ఎన్ని సంవత్సరాల అనుభవమున్నా, ఎన్ని అర్హతలున్నా - అక్కడి స్త్రీకి పురుషుని తర్వాత స్థానమే!

ఒక సీనియర్ ఆఫీసరు (పురుషుడు) రిటైరు అయిననాడు, ఆ స్థానాన్ని నింపేందుకు మరొక పురుషుడే అర్హుడవుతాడు. ఎన్ని అర్హతలున్నా ఒక డిపార్టుమెంటుకు హెడ్డుగా స్త్రీని నియమించడం అమెరికా సాంఘిక వ్యవస్థ అంగీకరించదు. ఉద్యోగరీత్యా ఇద్దరు వ్యక్తులు పనిచేస్తున్నప్పుడు, వారి అర్హతనుబట్టి, అనుభవాన్నిబట్టి వారికి గుర్తింపు వుండాలి. ఈ గుర్తింపుకు ఆ వ్యక్తి యొక్క 'సెక్సు' (పురుషుడా, స్త్రీయా అన్న మీమాంస) ఏ విధంగానూ అడ్డు రాకూడదు. అలా అడ్డు వచ్చిన నాడు, ఆ సంఘం ఎన్ని విధాల, ఎన్ని రంగాలలో ముందడుగు వేసినా, ఆ సంఘంలో స్త్రీకి స్వాతంత్ర్యం లేదనే చెప్పాలి.

స్త్రీ స్వాతంత్ర్యానికి ప్రమాణంగా ఈ పరిస్థితులను తీసుకుంటే, భారతదేశంలో స్త్రీ స్వాతంత్ర్యం చాలా వుందనే చెప్పాలి.

పాశ్చాత్య సాంఘిక వ్యవస్థకు మన సాంఘిక వ్యవస్థకు–వారి ఆర్థిక సూత్రాలకు మన ఆర్థిక సూత్రాలకు, వారి ఆచార వ్యవహారాలకు మన ఆచార వ్యవహారాలకూ – వారి నైతిక విలువలకూ మన నైతిక విలువలకూ చాల వ్యత్యాసం వుంది.

అర్హతలు కలిగి, సమర్థురాలైన భారత స్త్రీ ఏ రంగంలోనయినా అత్యున్నత స్థాయినందుకోగలిగే అవకాశాలున్నాయి. ఒక డిపార్టుమెంటుకు అధికారిణిగా, ఒక జిల్లాకు కలెక్టరుగా, ఒక వ్యవస్థకు డైరెక్టరుగా, ఒక రాష్ట్రానికి గవర్నరుగా, దేశానికి ప్రధాన మంత్రిగా – ఇలా ఎన్ని విధాల చూసినా పురుషునితో పోటీచేసి - అర్హతలనుబట్టి -

పురుషునికంటె పై మెట్టును భారత స్త్రీ అందుకోవ డానికి ప్రోత్సాహాన్నిస్తుంది-భారతదేశపు నాగరికత.

మనం ప్రస్తుతం సంధి యుగంలో ఉన్నాం. గతాన్ని పూర్తిగా విడనాడ లేకపోతున్నాము. అలా అని పూర్తిగా క్రొత్త పంథాను అనుసరించనూ లేకపోతున్నాము. సంఘానికి మార్పు అవసరం. కాలవేగంతో పరుగు లిడవినాడు, పెరుగుదల ఆగి పోయిన సంఘం కుళ్ళుకంపు కొడుతుంది. దేశానికీ మరొక దేశానికీ దూరం తరిగిపోవడంతో-ఒకరి నాగరికతా ప్రభావం ఇంకొకరిపై ప్రసరించడం సహజం. ఆలోచనా రీతిలో మార్పులు వస్తాయి. అభిరుచులలో, అనుభూతులలో మార్పులు వస్తాయి. వ్యవస్థలు మారుతాయి. సంప్రదాయాలూ, ఆచార వ్యవహారాలూ-శాస్త్ర జ్ఞానమూ, ధర్మాలూ ఆఖరుకు నైతిక విలువలు కూడ మార్పు చెందుతాయి.

ఇలా అనుక్షణం మారిపోతున్న సమాజంలో మనిషి తబ్బిబ్బైపోతున్నాడు. అందరి మన స్తత్వం ఒక్కలా ఉండదు. మారిపోతున్న ఈ సమాజంతో మనిషి 'ఎడ్జస్ట్' అవడం అంత సులభం కాదు. అయినా ఎడ్జస్ట్ అవుతూ ముందుకు సాగిపోవాలి.

"యుగ యుగాలకు కొత్త చరిత్ర తయారవు తుంది. యుగయుగాల ఈ చరిత్ర కొత్త సంప్ర దాయాన్ని నెలకొల్పుతుంది. ఈ సంప్రదాయాన్ని ఒక్కసారిగా త్రోసి పారేయలేం."—సర్వేపల్లి రాధాకృష్ణ వంటి వారే ఇలా అభిప్రాయపడ్డప్పుడు, దానిని తోసి రాజనడం సామాన్యుడి అహంకారానికి గుర్తు.

చదవడం వ్రాయడమే విద్యకు కొలత బద్ద అయితే భారతదేశంలోని స్త్రీలలో నూటికి సుమారు ఇరవైమంది - అక్షరాస్యులు వున్నారు. మిగతా ఎనభై మందీ నిరక్షరాస్యులు. ఈ ఎనభై మందిలో చాలమటుకు కొండచరియలలోనూ, అడవులలోనూ, 'నాగరికతకు' దూరంగా బ్రతికేస్తున్నారు. వారి జీవితాలకు సరిపడే వారిని 'ఆదిమవాసులని' 'గిరిజనులని' 'హరిజనులని' అంటున్నాం.

అయితే విద్యావంతులైన స్త్రీలు తమ తోటి స్త్రీల గురించి చేస్తున్నదేమిటి? ఇందులో ఎంతమందికి తమ సంఘం గురించిగాని, దేశం గురించిగాని తెలుసు? ఎందరికి పిల్లలను ఎలా పెంచితే మంచి పౌరులుగా తయారవుతారన్నది తెలుసు? ఎంతమందికి తమ సాటి స్త్రీలను నిర్లక్ష్యం చేయకుండా ఆదరించే అమృత హృదయం ఉంది? మురికిలో కూరుకుపోతున్న ఎందరికి ఈ విద్యా వంతులు ఆదరణ - కాదు కనీసం సానుభూతి చూపించగలరు? ఈసడించకుండా ఎంతమంది ఆదరణ చూపించగలరు?

ఆడవాళ్ళు చదువుకున్నంత మాత్రాన ఇంటి పనులు చేయకూడదన్నది శాస్త్రమా? విద్యను అహంకారానికి అస్త్రంలా ఉపయోగించడం వివేకమా! విద్యవల్ల నేర్చుకున్న సిద్ధాంతాలను ఆచరణలో పెట్టి విద్యకు పరిపూర్ణత చేకూర్చిన నాడు, విద్యావంతుల విద్యకు ఒక విలువ ఏర్పడుతుంది.

"మమ్మల్ని ఇన్నిరోజులూ వంటింటి చీకటిలో బంధించారు. పిల్లల్ని కనడం, వారిని పెంచడమే మా జీవన పరమావధిగా మార్చారు. భర్త చెప్పు చేతల్లో వ్యక్తిత్వం కోల్పోయి కీలుబొమ్మగా, మానాభిమానాలు లేని యంత్రంగా మార్చి-భర్తకు ఊడిగం చేయిస్తూ వచ్చారు." ఇటువంటి నినాదాలు విద్యావంతులైన భారతస్త్రీలు కొందరు లేవదీస్తు న్నారు. సంఘాన్ని సవాలు చేస్తున్నారు.


ఒక పురుషుడు పరస్త్రీతో సంబంధాలు (అక్రమ) పెట్టుకున్నప్పుడు - పెళ్లయిన స్త్రీ పరపురుషుడితో

## ప్రకటన

వారపత్రిక చేతిలోకి తీసుకున్న లత దృష్టి ఒక పేజీపై నిలిచిపోయింది — "సన్నబడా లంటే 'లతారిష్ట' తీసుకోండి. నెల రోజుల్లో సన్నగా, నాజుగ్గా తయారవండి. ధర నలభై రూపాయలు మాత్రమే" దాని ప్రక్కగా లలితాంగులైన రమణుల చిత్రాలు. వారి స్థానాల్లో తన నూహించుకుని, తృప్తి చెంది వెల ఎక్కువైనా నెల రోజుల్లో పేరుకు తగ్గట్టు 'లత లాగా అవుతాను కదా'-అని మనసులో అనుకుని, పట్టు చీర కొరకు దాచు కున్న డబ్బులో నుండి, నలభై రూపాయలు మనియార్డర్ చేసింది. పాపం! లత లావుగా ఉంటుంది. ఒళ్ళు తగ్గించుకోవాలని తాప త్రయం. శ్రమపడకుండా, నోరు కట్టకుండా లావు తగ్గే మార్గం ఏదైనా దొరుకుతుం దేమోనని కనిపించిన పత్రికల్లా తిరగేస్తుంది. లత భర్తకు ఇలాంటివి ఇష్టముండవు.

"నీకేమోయ్! కొస్త లావైనా రంభలాగుం టావు. ఇక నీ నడుము. ఉన్నట్టా అది లేనట్టా" అంటూ పాట మొదలెడ్తాడు. అందుకొరకే అతనితో చెప్పకుండానే డబ్బు పంపింది.

ఎమ్. ఒ. పంపిన మూడవరోజు పార్సెల్ అందుకుంది లత. సీసాతోపాటు నాలుగు పేజీల బుక్ కూడా వుంది. ఆత్రుతగా తెరిచింది. మందుతో పాటించవలసిన విధులు: "ఇంటి పై భాగానికి మెట్లు వుంటే రోజూ నాలుగైదు



సార్లు ఎక్కి దిగాలి. ఉదయం మైలు దూరం నడచి రావాలి. ఇంట్లో పని మనిషిని తీసి వేసి సొంతంగా పని చేసుకోవాలి. చాకలిని తొలగించి బట్టలు స్వయంగా ఉతకాలి. గ్రైండర్‌లాంటి మిషన్స్ వాడకుండా పప్పు రుబ్బుకోవాలి. వొళ్ళు దంచుకోవాలి.

ఐస్‌క్రీమ్, బాదంగీర్‌లాంటివి అసలే వాడకూడదు. పంచదార లేని టీ, కాఫీలు, పాలకూర, తోటకూర లాంటివి ఉడకపెట్టు కుని తింటే మంచిది. నూనె, నెయ్యి" ఇక ముందుకు చదవలేకపోయింది లత. పీడ దుంపతెగ, ఇవన్నీ పాటిస్తే పీడి మందెం దుకు, బూడిదలో పొయ్యనా! పీనుగులాగై పానుపెక్కితే ఎవరు చేస్తారు పని? అని మనసారా తిట్టుకుంది. లెంప లేసుకుంది. ఇప్పుడు పతిగారు వేంచేస్తే గతి ఏమిటి? అని ఆలోచిస్తూ సీసాను షెల్ఫ్‌లో దాచేసింది!

—దేవులపల్లి శిరీష

సంబంధాలు పెట్టుకుంటే తప్పా? వివాహత్పూర్వం పురుషుడు లైంగిక సుఖాన్ని పొందడానికి అర్హు డయితే స్త్రీకి ఆ అర్హత ఎందుకు ఉండకూడదు అన్న 'విప్లవాత్మక' స్త్రీలు కూడా తయారవు తున్నారు.

ప్రతిదీ వ్యాపార సరళిలో నడుస్తున్న ఈ ఆధునిక యుగంలో సంక్షేమ ఉద్యమాలూ, ప్రగతి శీల సంఘాలు కూడా సాధారణంగా పరిశ్రమలుగా మారిపోతున్నాయి. సాంఘికాభివృద్ధిని లక్ష్యంగా కాక, ఒక ప్రత్యేక వ్యక్తిగత లక్ష్య సాధనకు ఈ సంఘాలను, ఉద్యమాలను పరిమితం చేయడం జరుగుతోంది. నాగరిక జీవనంలోని సంఘర్షణల సంఖ్య ఎక్కువ అవుతోంది. శీఘ్రగమనలక్షణం వల్ల నిలకడపాటు తక్కువైంది. అందినంతవరకు స్వాహా అన్న సూత్రం మీద నడుస్తున్న ప్రస్తుత జీవన సరళిలో, స్వార్థానికి కాక, సంఘ క్షేమానికై పాటుపడేవారి సంఖ్య తక్కువవుతోంది.

ఆదినుండి అంతంవరకు ప్రతి క్షణం మనిషి సమాజ జీవి కావడంవల్ల, సమాజం రకరకాల మనుషుల సమూహ ప్రవృత్తికి నిలయం కావడం వలన-అనుక్షణం మారిపోతున్న అభిప్రాయాలూ అభిరుచులవలన – నూతనత్వానికి నివాళి పలకడం అలవాటు అవడంవలన – కావలసిందేదో తెలియక తెలిసి కావలసినది నిష్కల్మషంగా సంపాదించు కోవడానికి అవకాశం లేకపోవడం వలన – భిన్నాభి ప్రాయాలవారు తమ తమ వాదాల్ని నెగ్గించుకునే తాపత్రయం ఎక్కువ కావడంవల్ల – నాగరికతకూ, సంస్కారానికి తేడా గమనించక పోవడం వలన– ధరల ధోరణిలో పడిపోయిన సగటు మనిషి, విలువలను విస్మరించడం వలన ప్రతి ఉద్యమం రాజకీయమయమైపోతోంది.

ఆచరణ యోగ్యం కాని నాగరికతను అనుక రించడంతో భావ స్వాతంత్ర్యం రాదు. నినాదాలు చేయడంతో ఆర్థిక స్వాతంత్ర్యం రాదు. నారీ సమాజ స్వభావాన్ని ప్రతిస్త్రీ అర్థం చేసుకునే తీరు ఏర్పడాలి మొదట. ప్రతి మహిళ సమస్యను తమ సమస్యగా భావించిన నాడే మహిళా ప్రపంచం ప్రగతిని సాధించగలుగుతుంది. పురుషులను కించ పరచినంత మాత్రాన స్త్రీ స్థానం మెరుగుపడిపోతుం దనే అపోహను విడనాడాలి. యవ్వనంలో అడు గిడే ప్రతి యువతిపై తమ నినాదాల, ప్రచారాల ప్రభావం ఎంతవరకూ పడుతుందో దృష్టిలో ఉంచు కుని ప్రవర్తించాలి.

ఈ యువతుల దృష్టిలో పురుషుడు అంటే ఎలా చిత్రీకరించబడుతున్నాడో, తద్వారా భావి జీవితంలో వారు తమ భర్తలకు ఇచ్చే విలువ, తద్వారా తాము పొందే విలువ, అనుభవజ్ఞులైన స్త్రీలు అర్థం చేసుకోవాలి. మనం ఇచ్చే విలువలు పసివారి హృదయాలపై సాధారణంగా శాశ్వత ముద్రలు వేసుకుంటాయి. ఆవేశంతో, అర్థం లేని అహంకారంతో అర్థవిహీనమైన పాశ్చాత్య అను కరణలో మన మౌలిక విలువలను విడిచిపెడితే— మనకు మనం అన్యాయం చేసుకున్నవారమే కాక, భావి నారీలోకానికి కూడా అన్యాయం చేసిన వార మవుతాము. నిష్పక్షపాతంగా నిజాన్ని యువతుల ముందుంచి వారి భావి సంక్షేమానికి పాటుపడే ప్రయత్నం చేయాలి. మనిషిగా బతికేందుకు మంచి చెడుల్ని విడివిడిగా చూడగలిగే వివేకం అవసరం. సృష్టి తనకు ఇచ్చిన జ్ఞానాన్ని వినియో గించుకుని, మంచితనాన్ని పెంచుకోవాలి. సత్సం ప్రదాయం వ్యక్తి ఆలోచనలకు ఆయువుపట్టు. అదృష్టవంతురాలైన స్త్రీ, తనకు అవకాశం ఇచ్చిన చదువును అర్థం చేసుకుని, ఆ విజ్ఞానాన్ని సాటి స్త్రీతో పంచుకుని, తనలోని సంస్కారాన్ని మెరుగు పరచుకుంటూ, స్త్రీకి మరొకస్త్రీ శత్రువు కాకుండా సాటిమనిషిగా చూడగలిగిన నాడు – ప్రతిస్త్రీ తనకు తానుగా జీవితానికి కొత్త వ్యాఖ్యానం చేసుకో గలుగుతుంది. ఇందుకు కావలసింది తాము మంచి చేస్తున్నామన్న ఆత్మవిశ్వాసం. ఆచరణలో పెడు తున్న ఆశయాలు సాటిస్త్రీకి ఎంతవరకు మంచిని చేకూరుస్తున్నాయన్న ఆత్మ విమర్శన — చెడును ఎదుర్కొని నిలబడగలిగే ఆత్మస్థైర్యం – అనుకున్న పనిని ఆసాంతమూ సాధించగలిగే పట్టుదల— ఇవన్నీ కలిగిన నాడు పురుషుని కంటె స్త్రీ తక్కువ అనే అభిప్రాయం (ఈ అభిప్రాయం చాలామంది స్త్రీలలో వుండడమే విచారకరం) తొలగిపోయి, పురుషునితో సమాన హక్కులను పొంద గలుగుతుంది.

మగవారిని ద్వేషిస్తూ, దూషిస్తూ నినాదాలు చేస్తే ఏ లక్ష్యాన్నీ సాధించలేము. ఎంచేతనూ అంటే పురుషునికి స్త్రీ ఎంత అవసరమో, స్త్రీకి పురుషుడు కూడా అంతే అవసరం.

వీరి సామరస్య కలయికే మానవ మనుగడకు మూలం.




1. ప్రపంచంలో ఏడు వింతలు వున్నాయని మీకందరికీ తెలుసు. కాని వాటిల్లో ఏడవ వింత ఏదో చెప్పగలరా?
2. స్వచ్ఛమైన వజ్రం ఏ రంగులో వుంటుంది?
3. అమెరికా, సోవియట్ రష్యా, ఈజిప్టు దేశాలలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మూడు నదులు ప్రవహిస్తున్నాయి. అవి ఏవి?
4. భూటాన్, బెల్జియం, పాకిస్తాన్, టర్కీ, థాయ్‌లాండ్ దేశాల రాజధాని నగరాలు ఏవో చెప్పగలరా?
5. అబ్రహాం లింకన్–అంటే ఎవరు?
6. మొదటి ప్రపంచ యుద్ధం ఎప్పుడు ప్రారంభమైంది? ఎప్పుడు అంతమైంది?
7. మనదేశం అంతరిక్షంలోకి 'ఆర్యభటా' అనే ఉపగ్రహాన్ని పంపింది. అయితే ఆసియా ఖండంలో మొట్టమొదట ఉపగ్రహాన్ని పంపిన దేశం ఏది?
8. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొట్టమొదటి ఎన్నికలు ఎప్పుడు జరిగాయి?
9. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీకి అధ్యక్ష స్థానం అలంకరించిన ప్రథమ వనిత ఎవరు?
10. పిన్న వయసులోనే నోబెల్ బహుమతి పొందిన వ్యక్తి ఎవరో చెప్పగలరా?

[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. వెతికి మీ సమాధానాలతో సరిపోతాయేమో పోల్చి చూసుకోండి]